క్లుప్తంగా

ముస్లింలకు శుభాకాంక్షలు


ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం అంటే కేవలం ఉపవాస దీక్షలు కాదని, మనిషికి ఆకలి విలువ తెలియజేస్తుందన్నారు. ఉపవాస దీక్షలతో మనిషి తన చెడు అలవాట్లను, కోపాన్ని, ద్వేషాన్ని వీడేందుకు అల్లా ప్రసాదించిన గొప్ప అవకాశమన్నారు. నియమనిష్టలతో చేపట్టే రంజాన్ మాసం ముస్లిం జీవితాల్లో వెలుగులు నిండాలని, వారికి నిత్యం ఆల్లా దీవెనలు ఉండాలని విప్ ఆకాంక్షించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


కొలిమి జగనన్న లేఅవుట్ కాలనీలో ఎంపీపీ, అధికారులు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న గృహ నిర్మాణ పథకంలో భాగంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి సూచించారు. గురువారం పట్టణంలోని కొలిమి లేఅవుట్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు, తాగునీరు, విద్యుత్ వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా కొంతమంది లబ్ధిదారులు కాలనీలో మోటారు చెడిపోవడం వల్ల నీరు అందడం లేదని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి త్వరగా మోటారు మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా బేగం, పంచాయతీ ఈఓ గౌస్‌లు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నియామకం


రామును అభినందిస్తున్న ఆర్.కృష్ణయ్య

కంబదూరు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రామును నియమించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని నియోజకవర్గాలు, మండలాల్లో పర్యటించి కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు.

జూదరుల అరెస్టు

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని కొందరు మద్యం సేవిచంఇ పేకాట ఆడుతుండటంతో స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. బ్రహ్మసముద్రం ఎస్ ఐ పరుశురాముడు సిబ్బందితో గురువారం మధ్యాహ్నం పేకాట స్థావరాలపై దాడి చేసి 10 మందిపి అరెస్టు చేసి, వారి నుంచి రూ.55 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బెళుగుప్ప: బెళుగుప్ప తండాకు వెళ్లే రహదారి పక్కనే పేకాట స్థావరంపై ఎస్ఐ రామకృష్ణయ్య తన సిబ్బందితో కలసి గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.18,71 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కమ్యూనిటీ టాయిలెట్స్ ప్రారంభించండి


ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

కూడేరు: స్వచ్ఛ భారత్ పథకం కింద స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రెండు కమ్యూనిటీ టాయిలెట్ గదులను రూ.6 లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకుని నెలలు గడుస్తున్నా వాటిని అధికారులు ప్రారంభించలేదు. సచివాలయాలు, ఇతర కార్యాలయాలకు పని నిమిత్తం వచ్చే ప్రజలు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు.

ఘనంగా పాతప్ప దేవర ఉత్సవాలు


గుమ్మఘట్ట: కలుగోడులో పాతప్ప దేవర ఉత్సవాల్లో పాల్గొన్న పోతురాజులు


వజ్రకరూరు: నీలగిరిస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో పాతప్ప దేవర ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరాలతో సమీపంలోని వేదావతి హగరిలో జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగా జలంతో అభిషేకించి శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం పోతురాజులు గ్రామంలో నాట్యమాడుతూ మేకపోతును పాతప్ప దేవర వద్దకు తీసుకువచ్చి గావులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎగురవేసిన పెరుగన్నం ముద్దలను పొలాల్లో చల్లితే పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం.

వైభవంగా నీలగిరిస్వామి ఊరేగింపు

వజ్రకరూరు: మండల కేంద్రంలో నీలగిరిస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని నీలగిరిస్వామిస్వామి ఈ నెల 16న సాయంత్రం వజ్రకరూరులోని ఆలయం నుంచి వేటకు బయలు దేరి వెళ్లారు. వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటించిన స్వామి బుధవారం రాత్రి వజ్రకరూరు చేరుకున్నారు. స్థానిక సె ంటర్‌లో స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొరువయ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులు స్వామికి టెంకాయలు, వెండిగొడుగులు, పూలమాలలు సమర్పించారు. అనంతరం స్వామిని ఆలయంలో కొలువుదీర్చారు.

జీడిపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: బెళుగుప్ప మండలం జీడిపల్లిలో నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు వెంటనే పునరావసం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్సీ కలసి పలు సమస్యలను ప్రస్తావించారు. రైతులు, ప్రజలు జీడిపల్లి రిజర్వాయర్ కోసం భూములు త్యాగం చేశారని, వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించి మరోచోట పునరావసం కల్పించాలన్నారు. దీని పై స్పందించిన సీఎం సంబంధింత కార్యదర్శిలను ఆదేశించి సమస్యను వెంటనే పరిష్కరించి నివేదికలు తమకు సమర్పించాలని ఆదేశించారు.

రెగ్యులర్ పోస్టులు కేటాయించండి

జిల్లాలోని ఉరవకొండ బాలికల జూనియర్ కళాశాల, ముదిగుబ్బ, గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజురు చేశారన్నారు. కళాశాలలు ప్రారంభమైనప్పటి నుంచి పార్ట్‌టైం అధ్యాపకులతో నడుస్తున్నాయన్నారు. సంబంధిత కళాశాలలకు వెంటనే రెగ్యులర్ పోస్టులు మంజురు చేయాలని కోరారు. పోస్టుల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ: ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఉరవకొండ సీడీపీఓ, ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీడీఎస్ పరిధిలో మొత్తం ఐదు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో వజ్రకరూర్ మండలం ఛాయపురం-ఓసీ, రాగులపాడు 2- ఓసీ, విడపనకల్లు మండలం గడేకల్లు2- ఎస్సీ, ఉరవకొండ మండలం వెలిగొండ1- బీసీ(ఏ), రాకెట్ల3 ఓసీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు.

కూడేరు: కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 5 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు సీడీపీఓ ధనలక్ష్మి గురువారం తెలిపారు.అందులో కూడేరు మండలంలోని జయపురం1- ఎస్సీ, అనంతపురం రూరల్ మండలంలో పి.సి.కాలనీలో1-(హెచ్.హెచ్.లోకో మోటర్ డిసేబిలిటీ, కురుగుంట1- బీసీఈ, రాప్తాడు మండలంలో గంగులకుంట 1- ఓసీ, రాప్తాడు 1-బీసీ(బీ)లకు కేటాయించారన్నారు. అర్హత ఉన్నవారు ఈ నెల 29లోపు కూడేరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

కంబదూరు:కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వనజ అక్కమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని కుర్లగుండ గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్(బీసీ డీ), శెట్టూరు మండలం చిన్నంపల్లి గ్రామంలో హెల్పర్ పోస్టు(బీసీ ఈ)ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 29లోపు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

పప్పుశనగ రైతులకు గిట్టుబాటు ధర


పప్పుశనగ తూకాలను పరిశీలిస్తున్న ఎంపీపీ నారాయణ రెడ్డి, ఏఓ నవత

కూడేరు: రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం మొట్టమొదటిసారి మండలంలో పప్పుశనగను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పి.నారాయణపురంలో మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పప్పు శనగ కొనుగోలును ఎంపీపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పి.నారాయణపురం గ్రామంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో శనగ పంటను సాగు చేశారన్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి కొనుగోలు ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ఏఓ మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులు క్వింటాల్ రూ.4,500లో కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం రూ.5,335తో కొనుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగాన్ని చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి , ఏఈఓ శైలజ, వీహెచ్ఏ ప్రమోద్, వైఎస్సార్ సీపీ నేత తోపుదర్తి రామాంజనేయులుతో తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, మురుగునీటిని శుద్ధ చేసి తిరిగి వినియోగంచే పద్ధతులు, చెత్తతో కళాకృతులు తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, తడి చెత్త వినియోగంతో కంపోస్టు తయారీ మొదలైన విభాగాల్లో అవార్డులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 24లోగా పురపాలకసంఘంలో నమోదు చేసుకోవాలని, ఎంపికైన వారికి జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు రేపు

కూడేరు: మండల కేంద్రంని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును ఈ నెల 25న ఉదయం 11 గంటలకు చేపడుతున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు గురువారం తెలిపారు. ఆలయ సేవా కమిటీ, జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి లెక్కింపునకు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి శ్రీహరి ముడి


శ్రీహరి ముడితో పాదయాత్రగా వెళ్తున్న మాలధారులు

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి శ్రీహరిముడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో మాలధారుల శ్రీహరి ముడి కార్యక్రమం నరసింహస్వామి దేవాలయ కమిటీగౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ, వేదపండితుడు హరిప్రసాద్ భరద్వాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయంలో వేంకటరమణస్వామికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నైవేద్య పూజలు నిర్వహించారు. శ్రీహరి ముడి అనంతరం మాలధారులు ఆలయం వద్ద నుంచి మల్లాపురంలోని నరసింహస్వామి ఆలయం వరకూ పాదయాత్ర నిర్వహించి ఇరుముడి సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారి సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు రాఘవేంద్ర, కార్యవర్గ సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, కమలాక్షుడు, తిమ్మారెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు పక్కాగా ఉండాలి


పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ దామోదర్‌రెడ్డి

వజ్రకరూరు: పంచాయతీ రికార్డులు పక్కాగా ఉండేలా పక్కా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ దామోదర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి రికార్డులు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ఏటా నిర్వహించే వారపు సంత వేలం వెంటనే నిర్వహించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, పన్నుల వసూళ్లు వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధురెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎనుములదొడ్డిలో కొత్త పీహెచ్‌సీ

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసినట్లు వైద్యాధికారిణి అనూషా దేవి గురువారం తెలిపారు.ఎనుములదొడ్డి, తెనగల్లు, తూముకుంట, బెస్తరపల్లి, జంబుగుంపల తదితర పంచాయతీలను కలుపుతూ ఎనుములదొడ్డిలో పీహెచ్‌సీ ఏర్పాటవుతుందన్నారు. రెండు, మూడు రోజుల్లో ఆస్పత్రిని ప్రారంభిస్తామని, ఇప్పటికే ఇద్దరు వైద్యాధికారులను కొత్త పీహెచ్‌సీకి కేటాయించినట్లు వైస్ ఎంపీపీ బీజప్ప, సర్పంచ్ మహదేవమ్మ తెలిపారు. కాగా ప్రభుత్వం కొత్త ఆరోగ్య వైద్య కేంద్రాన్ని మంజూరు చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి'

రాయదుర్గంటౌన్: భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంతోపాటు వర్ధంతి, జయంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ నాయకులు కుమార్‌నాయక్, అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కేజీబీవీలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వీరేష్, నిఖిల్, చందు పాల్గొన్నారు.

స్థలం కబ్జా అవాస్తవం


మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా డెరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: పట్టణంలోని ముస్లిం కబరస్తాన్ (శ్మశాన) స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పెద్దదేవర మాబుపీరా, కణేకల్ల వైస్ సర్పంచు పెద్దదేవర నబీసా అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డిలతో కలిసి మైనార్టీ నాయకులు మాట్లాడారు. ముస్లిం కబరస్తాన్ అనేది అందరికీ సంబంధించిందన్నారు. కబరస్తాన్‌కు ప్రహరీ లేక ముళ్లకంపలతో అధ్వానంగా మారడంతో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం నుంచిరూ.19.50 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతో 285 మీటర్ల పొడువునా ప్రహరీ నిర్మించామన్నారు. ముందుభాగంలో వివిధ వృత్తుల వారి జీవనోపాధి కోసం బంకుల ఏర్పాటుకు స్థలాలు కేటాయించామన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. దుష్ప్రచారం మానుకోవాలని వారు హితవు పలికారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మహబు, సచివాలయ కన్వీనర్ గౌస్, ఖలందర్, నబీసా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-24 కు సంబంధించి 6వ తరగతిలో ప్రవేశంతో పాటు 7, 8 తరగతులల్లో మిగుల సీట్ల భర్తీ కోసం ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాయదుర్గం ఎస్‌ఓ లేమారోజ్ గురువారం సూచించారు. అర్హత కలిగిన పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక కేజీబీవీలో సందర్శించాలన్నారు.

బొమ్మనహాళ్: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ)లో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ మహాలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్‌లు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ వర్గాల బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యాభ్యాసానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ లలిత తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి కేజీబీవీ పాఠశాలలో 6 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అనాథ పిల్లలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్ పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల వారు హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కూడేరు: కేజీబీవీల్లో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌తో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీ ఉన్న సీట్లకు ఈ నెల 27 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాధికారి చంద్రశేఖర్ గురువారం తెలపిఆరు. ఏప్రిల్ 20 వరకూ అవకాశముంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, డ్రాపౌట్, అనాథ పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కూలీలకు వసతులు కల్పించండి

కుందుర్పి: ఉపాధి పథకం కింద పనులకు వెళ్లే కూలీలు ఎండల్లో వడదెబ్బకు గురికాకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ నారాయణస్వామి, ఏపీఓ రామచంద్ర సూచించారు. గురువారం అప్పిలేపల్లి, మహంతపురం గ్రామాల్లో జరుగుతోన్న ఉపాధి పనులను వారు పరిశీలించారు. వారం రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండడంతో పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం 1150 మంది కూలీలు పనులకు వెళుతున్నారని, అర్హులందరికీ పని కల్పించి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి పంచాయతీకి 10 చొప్పున టార్పాలిన్లు, గడ్డపారలు అందజేశామన్నారు.

రాగిజావతో ఆరోగ్యం


బ్రహ్మసముద్రం: మాట్లాడుతున్న ఎంపీపీ

ఉరవకొండ: స్థానిక వాసవీ కల్యాణ మండపం వద్ద ఉన్న ప్రభుత్వ పడమర ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఎంపీటీసీ సభ్యుడు, వార్డు సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బీరే శివ, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, వడ్డే ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వెంకటేశులు , నాయకులు తిమ్మరాయుడు, హనుమంతరెడ్డి, తిప్పారెడ్డి, అంజిన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు వైభవంగా బోనాలు


కూడేరు: అరవకూరులో బోనాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

కూడేరు: మండలంలోని అరవకూరులో గురువారం గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రతి ఇంటి నుంచి బోనాలను బొండ్రాయి వద్దకు తీసుకు వచ్చారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ దేవతలైన పోతులయ్య, పెద్దమ్మ, కుంటిమ్మ, మారెమ్మ, సుంకలమ్మ, ముత్యాలమ్మ దేవాలయాలకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆయా దేవతామూర్తులకు బోనాల్లో తెచ్చిన ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది పండుగ మరొసటి రోజు బోనాల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

కనులపండువగా అక్కమాంబ జాతర

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలో గురువారం గ్రామ దేవత అక్కమాంబ జాతర కనుల పండువగా నిర్వహించారు. ఏటా ఉగాది మరుసటి రోజున అమ్మవారి ఉత్సవం నిర్వహిస్తారు. స్థానిక ఓబుళదేవరస్వామి ఆలయం నుంచి జంబుగుంపల మార్గంలో ఉన్న అక్కమాంబ దేవాలయం వరకు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం, పానకం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. మండలం నుంచే గాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకొన్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

రాయదుర్గం: పట్టణంలోని పార్వతీనగర్‌లో వరుసగా నాలుగిళ్లలో సోమవారం రాత్రి జరిగిన చోరీలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇళ్లకేసిన తాళాలు పగలగొట్టి ఓ ఇంట్లో నగదు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు. అలాగే రైల్వేస్టేషన్, మారెమ్మగుడి, నేసేపేట తదితర ప్రాంతాల్లో రాత్రిళ్లు కొత్త వ్యక్తుల సంచారం పెరిగింది. దీంతో స్థానికులు భయందోళన చెందుతున్నారు. వేసవి వచ్చిందటే చాలు దొంగలు పట్టణంలో హల్‌చల్ చేస్తున్నారు. ఉక్కపోత కారణంగా ప్రజలు ఇళ్లలో కాకుండా ఆరుబయట, లేదా మిద్దెలపై నిద్రిస్తుండడం వల్ల దుండగులు ఇళ్లలోకి సులభంగా చొరబడుతున్నారు. కిటికీల పక్కనే హ్యాంగర్లు ఉంచడం, కిటికీల్లో తాళాలు ఉంచడం వల్ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాగే వేసవి కారణంగా చాలామంది తెల్లవారుజామున, రాత్రిళ్లు నడక సాగిస్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకుని గొలుసు దొంగలు మహిళల మెడలోంచి బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. రెండేళ్ల క్రితం చర్చి ఏరియాలో ఎల్ఐసీ ఉద్యోగి ఇంట్లో సినీ ఫక్కీలో జరిగిన చోరీని నేటికీ పట్టణవాసులు మరచిపోలేకపోతున్నారు. ఇటీవల పట్టణంలోని రామస్వామి వీధి, శాంతినగర్, రైల్వేస్టేషన్, మారెమ్మగుడి ఏరియా తదితర ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇళ్ల వద్ద నిలిచిన వాహనాల్లో నుంచి పెద్ద ఎత్తున బ్యాటరీల చోరీకి పాల్పడ్డారు. ఇలాంటి చిల్లర దొంగల ఆట కట్టించకపోతే ప్రజలకు భయందోళన తప్పని పట్టణవాసులు కోరుతున్నారు.

గస్తీ ముమ్మరం చేయిస్తాం

పట్టణంలోని అనుమానితంగా ఉండే పలు ప్రాంతాల్లో పోలీస్ గస్తీ ముమ్మరం చేయించేలా చర్యలు చేపడతాం. ఇళ్లలో విలువైన బంగారం వస్తువులు, నగదు పెద్ద మొత్తంలో ఉంచుకోకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలి. ఏదైనా ప్రాంతాలకు వెళ్లే సమయంలో సంబంధిత ఇంటి యజమానులు వారి పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం ఇస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌ఎచ్‌ఎంఎస్)ను ఉంచి పర్యవేక్షణ చేస్తాం.

– యుగంధర్, సీఐ, రాయదుర్గం


జిల్లాకేంద్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన జరిగిన ఉగాది సంబరాల్లో తుంబిగనూరి ఈశ్వర దేవాలయ పూజారి మల్లికార్జున స్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం, కళ్యాణదుర్గం ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడి, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. - కణేకల్లు